# ఎదురుచూసిన వార్త

భాగ్యం విషం మింగేసింది పొద్దున్నే బిందె తీసుకుని మామూలుగా నీళ్ళకు వచ్చిన భాగ్యం విషం మింగేసింది. ఆస్పత్రికి తీసుకుపోయారు. విషానికి విరుగుడు ఇవ్వడమూ, అది చకచకా పని చెయ్యడమూ, భాగ్యం చిరునవ్వుతో తిరిగి ఇంటికి రావడమూ జరిగిపోయింది. అయినా ఆ పల్లెటూరిలో అమ్మలక్కల నోళ్ళు మాత్రం పనిచేస్తూనే ఉన్నాయి.




డి. కామేశ్వరి

"అత్తయ్యా, అత్తయ్యా! భాగ్యం విషం మింగేసిందట" అంటూ పరిగెత్తుకువచ్చి అత్తగారికి తాజా వార్త అందించింది సుబ్బలక్ష్మి.

"ఏ భాగ్యమే!" అంటూ విస్మయపోయింది అత్త రత్తమ్మ.


"అదే నత్తయ్యా! మన ఎదురింటి భాగ్యం" అని స్పష్టం చేసింది.

"పొద్దున్నే కదుటే బిందెపట్టుకు నీళ్ళకి వచ్చింది! సాయంత్రం కల్లాగా ఏం మాయ రోగం వచ్చిందీ" అంటూ సాగదీసింది.

పట్నవాసంలాటి ఆ పల్లెటూళ్లో, చుట్టుపక్కల ఏ శుభం జరిగినా, అశుభం జరిగినా, ఎవడు తాగివచ్చి అల్లరి చేసినా, ఎవత్తె లేచిపోయినా ముందుగా రత్తమ్మకే తెలుస్తుంది. చల్లగా ఉండమని దీవించడమో, ఎంత కష్టం వచ్చిందీ అని వగవడమో, నాలుగూ కడిగేసి కాస్త గడ్డిపెట్టడమో రత్తమ్మ తరవాతే మిగిలినవారి వంతు.

ఈ పదవికి ఆ ఊళ్లో రత్తమ్మకు పోటీ ఎవరూ లేరు. ఇక వస్తారన్న భయమూ లేదు. రత్తమ్మ భర్త కష్టపడి పైకివచ్చిన కష్టజీవి. భర్తతో పాలు పంచుకున్న అర్ధాంగి రత్తమ్మ. అందువల్లే ఆ దంపతులకు కష్టం విలువ ఎప్పుడు తెలుస్తూంటుంది. మరో జీవి బాధ పడుతూంటే చూసి ఊరుకోలేని తత్త్వం వారిది.

ఉగాది శుభాకాంక్షలు




అధునాతన ఉక్కు ఫర్నిచరు

తయారు చేయువారు :

లల్లూరాం అండ్ కంపెనీ

హెడ్డాఫీసు : విజయవాడ-1. బ్రాంచి : మద్రాసు

ఆంధ్రప్రదేశ్ పంపిణీదారులు :

పాంచాల్ సేల్సు కార్పొరేషన్,

ఏలూరురోడ్, విజయవాడ–2. రాజారంగయ్యప్పారావువీధి, విజయవాడ–1.

లల్లూరాం ఫర్నిచరు ఇచ్చటకూడా దొరకును :

**విశాఖపట్టణం :** విశ్వం, అప్సర ఆర్కేడ్, పాలూరు: తాజుద్దీన్ ఏజన్సీన్, **తాడేపల్లిగూడెం :** దారపు నాగేశ్వరరావు, **తణుకు :** కృష్ణప్రసాద్ ఏజన్సీస్, **గుంటూరు :** ప్రగతి ఏజన్సీస్, **పొన్నూరు:** రామకృష్ణా ఏజన్సీస్, **చీరాల :** మూర్తి ట్రేడర్స్, **ఒంగోలు :** మిత్రాఎంటర్‌ప్రైజెస్, **వినుకొండ:** వేంకటేశ్వర ఐరన్ అండ్ ప్లాస్టిక్ ఫర్నిచర్, **విజయపురి :** బృందావన్ స్టోర్స్, **నెల్లూరు:** మిత్రా ఎంటర్‌ప్రైజెస్, **తిరుపతి:** పి. సంజీవరెడ్డి అండ్ కంపెనీ, **మద్రాసు:** మీరా మెటల్ కార్పొరేషన్, **మధురై:** రాణిఫర్నిచర్స్ **సేలం:** నేషనల్‌ఏజన్సీస్, **ఎర్నాకులం:** జవహర్‌ఏజన్సీస్, **కొట్టాయం:** జాకబ్ అండ్ జాకబ్, **చిదంబరం:** ఎస్.ఎస్.ఎ. దశరథ చెట్టి.

Suvarna


"సైకిల్ రిక్షాలో నర్సింగ్ హోమ్‌కి తీసుకువెళుతున్నారు. మీరూ వెళ్లండి; నే నింట్లో ఉంటాను" అంది సుబ్బలక్ష్మి.

రత్తమ్మ గబగబలాడుతూ తన హోదాకి తక్కువ కాకుండా, పెద్ద కోడలు పండగకోసం కొనుక్కున్న వాయిల్ చీర పెట్టెలోంచి తీసి కట్టుకుని, తల పైపైని దువ్వుకుని బయలుదేరేటప్పటికిఅరగంట దాటింది. రత్తమ్మ నర్సింగ్ హోమ్ చేరేటప్పటికి అక్కడ ఎమ్. బి. బి. ఎస్. భాగ్యానికి విరుగుడు ఇంజక్షను ఇవ్వడమూ, అది చకచకా పనిచెయ్యడమూ, భాగ్యం చిరునవ్వుతో రిక్షాలో మళ్లీ ఇంటికి బయల్దేరడమూ జరిగిపోయాయి. భాగ్యం వెనకా లే వస్తున్న ట్రూపులో రత్తమ్మా ఒక మామూలు మెంబ రయింది, అంతే!

వంటపనితో సతమతమవుతున్న రత్తమ్మ పెద్దకోడలు పార్వతికి ఈ వార్త కాస్త ఆలస్యంగానే చెవిని వేసింది తోటికోడలు సుబ్బలక్ష్మి. చెవిని పడడమే తడవుగా ఎక్కడి సామాన్లు అక్కడే పడవేసి, చేతిలో పని వదిలేసి వీథి గుమ్మంలోకి వచ్చి, కథ ఎలా ముగిసిందోనని ఎదురుచూస్తూ నిలబడ్డారు తోటికోడళ్లిద్దరూ.

కోడళ్లిద్దరూ కాపరానికి వచ్చి దాదాపు రెండు నెలలు హెచ్చుతగ్గుల్లో అయిదేళ్లు దాటింది. అత్తారింటి వాతావరణం, అలవాట్లు చాలావరకు పుణికి పుచ్చుకున్నారు.

"ఏమిటోనే, అక్కా! నాకు భయంగా ఉందే. ఆ భాగ్యం ఎలా బతికి బయట పడుతుందో ఏమిటో?" అంది సుబ్బలక్ష్మి బెదురుగా.

"కాస్సేపట్లో అత్తయ్య వచ్చేస్తారు. సంగతేమిటో తెలుస్తుందిగా, ఇంతలో భయమెందుకు?" అని ధైర్యం చెబుతూండగానే సైకిల్ రిక్షాలో భాగ్యం, దాని మొగుడూ దిగారు. కాస్సేపటికల్లా రత్తమ్మ బృందం వస్తూ వస్తూ దారిలోనే ఎవరిళ్లకు వాళ్లు విడిపోయారు.

"ఎలా ఉంది, అత్తయ్యా, ఎలా ఉంది" అంటూ అత్త సమాధానం కోసం ఎగబడ్డారు కోడళ్లిద్దరూ.

"నిక్షేపంలా ఉంది, దానికేం? విషం కాదుట, ఆవేవో ఆస్తమా మాత్రలు మింగిందిట. పొయ్యి మీద అన్నం చూశావా, పార్వతీ?" అంటూ చీర మార్చుకుందుకు వెళ్లిపోయింది రత్తమ్మ.

రెండంగల్లో వంటింట్లో పడింది పార్వతి. ఇంతాచేసి అత్తగారు అసలు సంగతి చెప్పిందే కాదు. విక్షేపంలా ఉందిట భాగ్యం! కాని, ఇప్పుడు పార్వతికి ఏదో మింగినట్టనిపించింది. అన్నం చిమిడి ముద్దయిపోయింది. రాత్రికి మొగాళ్ల దగ్గిర దీవెనలు తప్ప వను కుంది. అయినా, భారం వెయ్యటానికి దేవు డున్నాడుగా!

సాయంత్రం కాగానే కష్టజీవు లందరూ ఆఫీసుల నించి కొంపలు చేరుకున్నారు. ఎవరి భర్తలకి వాళ్లు కాళ్లు కడుక్కునేందుకు నీళ్లిచ్చు కున్నారు. బట్టలు విడిచి మారు బట్టలు కట్టుకునేంతలో భర్తకు, కొడుకులకు, మనవలకు, మనవరాళ్లకు వడ్డించేసింది రత్తమ్మ. అన్నం చిమిడి పోయిందని గుర్తించిన రత్తమ్మ, పార్వతికి చివాట్లు పడకుండా ఉపాయం ఆలోచించుకుంది.


రత్తమ్మ పెద్దకొడుక్కి అన్నం మెత్తగా గుజ్జులా ఉండాలి. రెండో వాడికి కాస్త బిరుసుగా ఉండాలి. మొగుడు ఎలా ఉన్నా సర్దుకుపోతాడు. కాని, ఇవాళ మరీ మెదిపోయేసరికి రెండోవాడు మొహం అదోలా పెట్టాడు. ఇది కనిపెట్టిన రత్తమ్మ మెల్లిగా మాటల్లోకి దింది. "ఏమంటే! మీకు తెలిసిందా, ఎదురింటి భాగ్యం అత్తమా మాత్రలు మింగేసిందిట" అంది.

మొగాళ్లందరూ రత్తమ్మవంక దీక్షగా చూడసాగారు. "పొద్దుటే గదటే బింది పట్టుకు మనింటికి నీళ్లకి వచ్చింది. ఆ?" అన్నాడు రత్తమ్మ మొగుడు, ఈ వార్తకు ఆశ్చర్యపోతూ.

"అవుననుకోండి. పరిస్థితు లెప్పుడూ ఒకేలా ఉంటాయా? దాని మొగుడు ఎవతెని వెంటేసుకు వచ్చాడో, ఏమో?" అని ఆపి, రెండో వాడు తన దారిలో పడ్డాడని గ్రహించి, "లక్ష్మీ! మా వాడికి కాస్త పచ్చడి వెయ్యవే" అంటూ సుబ్బలక్ష్మికి పురమా యించింది.

సన్నెన్ను అంటే గిట్టని రత్తమ్మ మొగుడు 'ఊఁ కానియ్' మన్నట్టు మొహం పెట్టాడు. అందుకుంది రత్తమ్మ. "ఈమధ్య వాడు చాలా మందికి ఉద్యోగా లిప్పిస్తున్నాట్టండీ. మనవాడికి కూడా ఏదేనా నౌకరీ దొరుకుతుందేమోనని ఆ విశాలని అడి గాను. వాళ్ల కంపెనీలో మొగాళ్లకి ఉద్యోగా ల్లేవుట. మరి ఈ అమ్మాయి లకి మాత్రం ఎలా దొరుకుతున్నాయీ అని ఆరా తీద్దునుకదా ..." అంటూ కాస్త ముందుకు వంగి మొగుడి చెవి దగ్గిర అందరికీ వినబడేటంత రహ స్యంగా, "భాగ్యం మొగుడు భద్రం ఓ ముండల ముఠా కోరు, వాడి మేనేజరు ఓ తిరుగుమోతూనుట. అందుకే వారానికో కొత్త అమ్మాయికి ఉద్యోగం వస్తూంది వాళ్ల కంపెనీలో" అని, "ఏమిటే, పార్వతీ! అలా నించుని కథ వింటూంటే వడ్డనవుతుందిటే? మజ్జిగ వెయ్యి గమ్ముని అందరికీ" అని ఓ రంకె వేసి, వదిలిపెట్టిన సశే షంలో మళ్లీ కలుసుకుంది.

"పాపం! ఆ భాగ్యం బతుకు ఏమవుతుందో ఏమిటో? తల్లి లేని బిడ్డ. ప్రేమించి పెళ్లి చేసుకుంది ఆ భద్రాన్ని. వాడేమిరా అంటే ఇలా తయారయ్యాడు. ఆఖరికి దాని



జీవితమే అధోగతి పాలైపోయేలా ఉంది. పాపం! ఆడకూతు రేం చెయ్యగలదు" అని తను బృందంలో సేకరించిన న్యూసుకి కొంత జోడించి ముగించింది రత్తమ్మ.

భోజనా లయ్యాక రత్తమ్మ మొగుడు, కొడుకులు 'చూసుకో, మేం గనక మిమ్మల్ని ఒకళ్లనే కట్టుకు ఏడుస్తూన్న ఏకపత్నీవ్రతులం' అన్నట్టు గర్వంగా తమ భార్యలమీద ఒక్క చూపు విసిరి, కంచాల్లోనే చేతులు కడుక్కుని లేచి వెళ్లిపోయారు.

రాత్రి అందరూ సుఖంగా నిద్ర పోయినా, రత్తమ్మకు మాత్రం చాలా సేపటిదాకా నిద్ర పట్టలేదు. తను దారిలో విన్న పుకారులు తప్పితే అసలు సంగతి ఏమిటో తెలియనే లేదు. 'రేపు తెల్లారి ఎలాగూ బింది పట్టుకు ఇక్కడికి రావలసిందేగా? ఏడుకొండల వాడి ధర్మమా అంటూ ఈ నీళ్ల కరువు రోజుల్లో మా నూతిలో నాలుగు చుక్కల నీళ్లుండబట్టే గదా...సినిమా లకి వెళ్లక్కర్లేకుండానే, అందులోని దృశ్యాలు ఇక్కడ ప్రత్యక్షంగా చూడ గలుగుతున్నాం' అనుకుంటూనే నిద్ర లోకి జారుకుంది.

* * *

భద్రం కెమిస్టుగా ఉద్యోగంలో స్థిరపడి పదేళ్లు దాటింది. వీధిబళ్లో చదువుకునే రోజుల్లోనే, బలపం కొనుక్కునేందుకు రెండు పైసలిస్తే, దానితో పలక పుల్ల కొని, విరిచి భాగ్యా నికి సగం ఇచ్చేవాడు. ఆమె ఇలా అతనితో పాలుపంచుకుంటూ, ఈనాటి భద్రానికి అర్ధాంగిగా స్థానం సంపా దించుకుంది.

చిన్నప్పటినుంచీ భాగ్యానికి ఓరిమి ఎక్కువ. ఒక్కో క్లాసు రెండేళ్లు చాలా కష్టపడి చదివేది. అయితే, భద్రానికి అంత ఓరిమి లేదు. ఏ యేటి కా ఏడు ఒకో క్లాసు దాటేసేవాడు. భద్రం కాలేజీలో ప్రవేశించేనాటికి భాగ్యం ఫస్టు ఫారంలోనే పెద్దమనిషై, చదువు మానేసి, గరిటె పుచ్చుకుని వంటింట్లోకి అడుగు పెట్టింది.

కాలేజీ పట్టా పుచ్చుకున్నా, ఈనాటి కుర్రకారుల్లా కాకుండా, భాగ్యాన్ని పెళ్లిచేసుకునే ప్రేమించాడు భద్రం.

* * *

ఏడు గంటలకిగాని నిద్రలేవని భాగ్యాన్ని, తెల్లారగట్ట అయిదింటి కల్లా భర్త లేవగొట్టేసరికి, పలత నిద్ద రయింది.

"భాగ్యం! రాత్రి చెప్పానుగదుటే, ఇవాళ మా డ్రగ్ ఇన్‌స్పెక్టరు వస్తున్నా డని. రోజులా ఏడు గంటలకి లేస్తే ఎలా చెప్పూ?" అని మందలించాడు.

ముక్కుతూ, మూలుగుతూ లేచి, భర్తకి వేణ్ణీళ్లు తోడి, టిఫిన్ కాఫీ చేసి అందించేసరికి భాగ్యానికి తలనొప్పి ప్రారంభమైంది.

భద్రం ఆఫీసుకి వెళుతూ వెళుతూ, "ఇదుగో, భాగ్యం! తలనొప్పి ఎక్కువగా ఉంటే ఆ అలమారులో తెల్లమాత్ర లున్నాయి, వేసుకో" అని గబగబా గుమ్మం దాటి వెళ్లిపోయాడు.

తలనొప్పి ఎక్కువ కావటంచేత, భాగ్యం అలమారు తెరిచి తెల్ల మాత్రలకోసం గాలించింది. అందులో ఉన్న సీసాల్లో రకరకాల మందులన్నీ చాలావరకు తెల్లమాత్రలే!

ఏ మాత్ర వేసుకోవడం? సంది గ్ధంలో పడింది భాగ్యం. తల పగిలి పోతూంది. ఎ, బి, సి లతో చదువు ముగించిన భాగ్యానికి ఏ మందు ఎందుకో తెలుసుకునేటంత పరిజ్ఞానం చాలదు. ఏమైతేనేం, మామూలుగా తనకు తలనొప్పి వస్తే భర్త ఇచ్చే సైజులో ఉన్న తెల్లమాత్ర ఒకటి తీసి వేసుకుని, నీళ్లు తాగి పడుకుంది. కాని తలనొప్పి తగ్గకపోగా మరింత ఎక్కువైంది.

భాగ్యం మళ్లీ మరోటి వేసుకుంది. లాభం లేకపోయింది.

మళ్లీ ఇంకోటి వేసుకుంది. మాత్రల రియాక్షనువల్ల నిద్ర పట్టింది. హాయిగా నిద్ర పట్టింది— అంతే!

* * *

మరునాడు రత్తమ్మ భాగ్యంకోసం ఎదురుచూస్తూంది. భాగ్యం మందు మింగిన రోజు లగాయతు ముసురు పట్టి వర్షం ప్రారంభమైంది.

కొంతకాలంగా ఉన్న నీళ్ల కరువు ఆ ఒక్క రోజులో తీరిపోయేలా, ఇంట్లోవాళ్లని బయటికి రానీయకుండా కుంభవర్షం కురవసాగింది.

ఆ పట్టు పట్టు వారం రోజుల వర్షంతో నూతులు నిండిపోయాయి. నీళ్ల కరువు తీరిపోయింది. భాగ్యం రత్తమ్మ ఇంటికి బింది పట్టుకు రావడం మానేసింది.

కాని —

రత్తమ్మ మాత్రం అసలు సంగతి తెలుసుకుందామని భాగ్యంకోసం ఎదురుచూస్తూనే ఉంది. ★